## క్లుప్తంగా

### చురుగ్గా అభివృద్ధి పనులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన రూ.2.47 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని ఏపీఓ జి.అరుణకుమారి, మండల ఇంజినీరింగ్ జేఈ డి.వీరభద్రరావు అన్నారు. మండలంలోని ఇప్పటికే పూర్తయిన పినపళ్ల, పెనికేరు, మూలస్థాన అగ్రహారం, సంధిపూడి గ్రామాల్లో శుక్రవారం వారు పర్యటించి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి కొలతలు నమోదు చేసుకున్నారు. తొలి విడతగా ఎన్ఆర్ఈజీఎస్ నుంచి పది గ్రామాల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. ఇప్పటి వరకూ నాలుగు గ్రామాల్లో పనులు పూర్తి కాగా ఏడు గ్రామాల్లోని పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. రెండో విడతలో మంజూరయ్యే ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మిగిలిన ఎనిమిది గ్రామాల్లో పనులు చేపట్టనున్నట్లు ఏపీఓ పేర్కొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అంబాజీపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అమలాపురం రూరల్ బండారులంకకు చెందిన బట్టు నాగపుల్లేశ్వరరావు (45) ఈ నెల 13వ తేదీ రాత్రి గంగలకుర్రు కుమ్మరిగరువులో జరుగుతున్న కలశ పూజకు తోటి అయ్యప్పలతో బైక్‌పై వెళుతూ ప్రమాదవశాత్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. దాంతో కాకినాడ ఆస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారన్నారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడు సోదరుడు బట్టు జయరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. మృతునికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.

### విఘ్నేశ్వరుని ఆదాయం రూ.1,92,535

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారికి శుక్రవారం ఒక్క రోజు ఆదాయం రూ.1,92,535 వచ్చిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామివారి ప్రత్యేక అభిషేకాల్లో 62 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. లక్ష్మీగణపతి హోమంలో 12 మంది, స్వామివారి పంచామృతాభిషేకాలో ఒక జంట పాల్గొన్నారు.

### గోదావరి మాతకు పున్నమి హారతి

ఆలమూరు: జొన్నాడలోని అఖండ గౌతమీ గోదావరి మాతకు పున్నమి హారతి జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహిళలు స్థానిక శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గోవింద నామస్మరణ చేస్తూ గౌతమీ తీరానికి చేరుకుని గోదావరి మాతకు పున్నమి హారతిని ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక శివాలయానికి విచ్చేసి జ్వాల తోరణం ఉత్సవంలో పాల్గొన్నారు.

### అయినవిల్లిలో నగర సంకీర్తన

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలో నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ ఆధ్వర్యంలో శుక్రవారం నగర సంకీర్తన చేశారు. ప్రభూ గోపాలదాసు, ప్రభూ సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూల సమక్షంలో శ్రీకృష్ణుని తత్వబోధ చేశారు. హారే రామా, హరే కృష్ణ మంత్రంతో లోక కల్యాణం జరుగుతుందన్నారు. ఇహపర లోకాల్లోను సద్గతులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

### జిల్లా కౌలు రైతు సదస్సుపై ప్రచారం

సఖినేటిపల్లి: ఈ నెల 22న సఖినేటిపల్లిలో నిర్వహించనున్న జిల్లా కౌలు రైతు సదస్సు విజయవంతానికి కౌలురైతు సంఘం ప్రతినిధులు శుక్రవారం పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇందులో భాగంగా ఈ మేరకు కేశవదాసుపాలెం, గొంది గ్రామాల్లో రైతు సంఘ రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన కేశవశెట్టి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్, నల్లి బుజ్జిబాబు, దొండపాటి చంద్ర మోహన్, కేశవ ప్రచారం చేశారు.

# పాత సర్వే ప్రకారమే రైల్వే లైన్ నిర్మించాలి

- ఆరు గ్రామాల ప్రజల ఆందోళన
- పేదలను ఆదుకోవాలని డిమాండ్



మొగలికుదురులో నిరసన తెలుపుతున్న రైల్వే లైన్ నిర్వాసితులు

మామిడికుదురు: కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ ఏర్పాటులో భాగంగా తాజాగా చేపట్టిన రైల్వే లైన్ సర్వేపై ఆరు గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. కొత్త సర్వే వద్దు, పాత సర్వే కావాలంటూ నిరసనకు దిగారు. పాత సర్వేకు అనుగుణంగా రైల్వే లైన్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఆరు గ్రామాలకు చెందిన నిర్వాసితులు శుక్రవారం మొగలికుదురులో ఆందోళన చేపట్టారు. తాజాగా చేపట్టిన సర్వే వల్ల చిన్న, సన్నకారు రైతులు భూములు కోల్పోతున్నారని, పేద ప్రజలు ఇళ్లు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2002 నుంచి 2004 వరకు నిర్వహించిన సర్వే ప్రకారం రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. ఈ అంశంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్‌కు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. కానీ పాత సర్వేను పక్కన పెట్టి తాజాగా సర్వే చేపట్టారని దాని వల్ల ఎంతో మంది నిరుపేదలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సర్వేను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలైనా అర్పిస్తాం, కొత్త సర్వే ప్రకారం రైల్వే లైన్ ఏర్పాటును అడ్డుకుంటామంటూ నినాదాలు చేశారు. పాశర్లపూడి, మామిడికుదురు, నగరం, గెద్దాడ, మొగలికుదురు, పాలగుమ్మి గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కొత్తగా చేపట్టిన సర్వేను నిలుపుదల చేసి పాత సర్వే ప్రకారం రైల్వే లైన్ నిర్మాణం చేపట్టని పక్షంలో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిర్వాసితుల ఆందోళన నేపథ్యంలో నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్, అయినవిల్లి ఎస్సై జోషి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### 42 ఎకరాలు కోల్పోతున్నాం



రైల్వే లైన్ నిర్మాణం కోసం తాజాగా చేపట్టిన సర్వే వల్ల పాలగుమ్మిలో 42 ఎకరాలు కోల్పోతున్నాం. ఇప్పటికే జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వల్ల 60 ఎకరాలు కోల్పోయాం. మాది చిన్న గ్రామం. ఇలా ఉన్న భూమంతా హైవేకు, రైల్వేకు కేటాయిస్తే మా పరిస్థితి ఏంటి. మేము ఎలా జీవనం సాగించాలి. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. పాత సర్వే అందరికీ ఆమోదయోగ్యమైంది. దాన్నే పరిగణనలోకి తీసుకోవాలి.

– అప్పారి వెంకటసత్యనారాయణమూర్తి, పాలగుమ్మి

### ప్రజా ప్రతినిధులు స్పందించాలి



కొత్తగా చేస్తున్న సర్వేను మెజారిటీ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. దీనిపై అధికారులు పునరాలోచన చేయాలి. ప్రజా ప్రతినిధులు కూడా ఈ సమస్యపై తక్షణం స్పందించి బాధితులకు అండగా నిలవాలి. నగరం గ్రామంలో 71.65 ఎకరాలు భూమి కోల్పోతున్నాం. నిరుపేదలకు చెందిన చిన్న, సన్నకారు రైతులకు చెందిన భూమితో పాటు నిరుపేదలకు చెందిన నివాసాలను కోల్పోవలసిన పరిస్థితి. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– జాలెం సుబ్బారావు, నగరం

### బాధితులకు న్యాయం చేయండి



లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి కలలు కన్న కోనసీమ రైల్వే లైన్ నిర్మాణాన్ని మేమంతా స్వాగతిస్తున్నాం. కానీ ఇదే సమయంలో ప్రజలకు నష్టం కలగకుండా దీన్ని ఏర్పాటు చేయాలి. కానీ తాజాగా చేపట్టిన సర్వేలో పేదలు భూములు కోల్పోతున్నారు. మా గ్రామంలో 23.45 ఎకరాలు భూమిని కోల్పోవలసిన పరిస్థితి. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలని కోరుతున్నాం.

– దొంగ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ, మొగలికుదురు

## ఘనంగా వీరభద్రుని సంబరం



మోరిలో వీరభద్రస్వామి సంబరంలో భాగంగా ఊరేగిస్తున్న ప్రభ

సఖినేటిపల్లి: మోరిలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి సంబరం ఘనంగా నిర్వహించారు. స్థానిక దాత జాన శంకరరావు, కుటుంబ సభ్యులు, డాక్టర్ కుందెం గిరిజాపతిరావు, కుటుంబ సభ్యులు, మోరి వీరభద్రస్వామి యూత్ సంయుక్తంగా ఆర్థిక సాయంతో ఈ సంబరం అట్టహాసంగా చేశారు. అలాగే స్వామివారిని కొలువుదీర్చిన స్వామి ప్రభ ఊరేగింపును కూడా మోరి పురవీధుల్లో కనుల పండువగా నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు స్వామివారికి అరటి పళ్లు, కొబ్బరి కాయలు నైవేద్యాలుగా సమర్పించుకున్నారు. కాగా ఊరేగింపులో శక్తి వేషాలు, బాణసంచా కాల్పులు, వీరకుమారుల నృత్యప్రదర్శన, తీన్‌మార్ బ్యాండు వాయిద్యాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. ఉత్సవ నిర్వహణ దారుడు కామిశెట్టి సూరన్న, కమిటీ సభ్యులు, జాన సునీల్ పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో అధిక ఉత్పత్తులు



కొత్తపేటలో వీఏఏ, వీహెచ్ఏల శిక్షణలో మాట్లాడుతున్న పీడీ జ్యోతిర్మయి

కొత్తపేట: వ్యవసాయ ఉద్యాన పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానంతో వ్యయాన్ని తగ్గించి, అధికోత్పత్తులు సాధించేలా రైతులను చైతన్యవంతులను చేయాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పీడీ వై.జ్యోతిర్మయి ఆయా శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బందికి సూచించారు. 2024-25 రబీ ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యాన పంటలు ముఖ్యంగా వరి, అరటి, కొబ్బరి తదితర పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ), గ్రామ ఉద్యాన సహాయకులు (వీహెచ్ఏ) లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మ పీడీ జ్యోతిర్మయి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ విస్తరణ సేవలు అందించాలన్నారు. వ్యవసాయంలో యూరియా, డీఏపీలకు బదులుగా నానో యూరియా, డీఏపీ ప్రయోజనాలను వివరిస్తూ వాటినే వాడించాలని సూచించారు. ఏడీఏ వెంకటరామారావు మాట్లాడుతూ రబీ ఈ-పంట బుకింగ్, ఈ-కేవైసీ విధి విధానాలు, ఈ రబీ సీజన్‌లో వరి, మినుము పంటల బీమా తదితర అంశాలను వివరించారు. సమావేశంలో ఏఓ జి.పద్మలత, రావులపాలెం ల్యాబ్ ఏఓ ఎం.శిరీష, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలను పరిష్కరించుకోవాలి



సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

అంబాజీపేట: భూ సర్వేలోని సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామసభలు దోహదపడతాయని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మాచవరం సచివాలయం వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సర్వేలో ప్రతి రైతుకు సంబంధిత వివరాలను పొందుపర్చామన్నారు. భూమి విషయంలో విస్తీర్ణం, కొలతలు, ఇతర సమస్యలున్నట్లయితే లిఖితపూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిన్నింటినీ పక్షం రోజుల్లో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం పలువురు రైతులు వినతులు, ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## డివైడర్ తొలగింపుతో ఇబ్బందులు

ఆలమూరు: మండలంలోని చెముడులంక 216 ఏ నంబరు జాతీయ రహదారి (హైవే)పై డివైడర్‌ను తొలగించడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అన్నారు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పలు ప్రమాదాలు జరియనే సాకుతో హైవే అధికారులు ఆ మార్గాన్ని మూసివేయడాన్ని సర్పంచ్ తప్పుబట్టారు. ఈ మేరకు హైవే పనుల పరిశీలన నిమిత్తం శుక్రవారం గ్రామానికి వచ్చిన హైవే ఏజీఎం మూర్తి, ప్లాజా మేనేజర్ వెంకట్రావుకు గ్రామస్తులతో కలసి ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. సర్పంచ్ తమ్మన మాట్లాడుతూ లంక పరివాహక ప్రాంతంలోని చెముడులంకతో పాటు బడుగువానిలంక గ్రామస్తులు కూడా గతంలో ఈ డివైడర్‌ను వినియోగించుకునే వారన్నారు. అధికారులు ఏ మాత్రం ముందస్తు సమాచారం ఇవ్వకుండా డివైడర్ మార్గాన్ని మూసివేయడంతో స్థానిక లంక గ్రామాల ప్రజలు తమ పంట ఉత్పత్తులను తరలించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా హైవే అధికారులు సత్వరమే స్పందించి డివైడర్ పునరుద్ధరణపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## రేపు శాలివాహన వన సమారాధన

అంబాజీపేట: కోనసీమ జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధనను ఈ నెల 17న మాచవరం సంఘ భవనంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి దాలిపర్తి భీమేశ్వరరావు, ఆదుర్తి నారాయణమూర్తి తెలిపారు. ఈ వన సమారాధనకు కుమ్మర శాలివాహన సంఘీయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 11 గంటల నుంచి చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పోటీలు జరుపుతామన్నారు.

# సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలి



కొత్తపేటలో ప్రభుత్వ శాఖల అధికారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ నరేష్‌కుమార్

కొత్తపేట: గ్రామ పంచాయతీలు, మండలాల పరిధిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా కృషి చేయాలని ఎంపీడీఓ పీఎస్.నరేష్‌కుమార్ మండల, గ్రామ స్థాయి అధికారులకు సూచించారు. బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (బీపీడీపీ), గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) 2025-26పై ప్రభుత్వ శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై ఎంపీడీఓ నరేష్‌కుమార్ అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధి, కుటుంబాల ఆర్థిక ప్రగతికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన కార్యక్రమాలను స్థానిక ప్రభుత్వాలు అమలు చేయాలని, కుటుంబాలను భాగస్వామ్యం చేయాలన్నారు. స్థానిక ప్రభుత్వ సంస్థలైన పంచాయతీ, మండల పరిషత్‌లు అభివృద్ధికి అవరోధంగా ఉన్న లోపాలను అరికట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లను సక్రమంగా వినియోగించుకునేలా పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సహజ వనరులు సమకూర్చుకుని, ఆదాయం పెంపొందించుకోవాలన్నారు. సమావేశంలో ఎంఈఓ ఎం.హరిప్రసాద్, ఏఓ జి.పద్మలత, ఈఓపీఆర్డీ సుబ్బారావు, ఏపీఎం విశ్వనాథం, ఐసీడీఎస్, తదితర శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, వలంటరీ ఆర్గనైజేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**అభివృద్ధి ప్రణాళికతో గ్రామాలకు మహర్దశ**

ఆలమూరు: అభివృద్ధి పనుల్లో జవాబుదారీతనం, పారదర్శకతను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన మండల అభివృద్ధి ప్రణాళిక (ఎంపీడీపీ), గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)తో గ్రామాలకు మహర్దశ పట్టనుందని ఎంపీడీవో ఏ.రాజు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం (ఎంపీడీపీ, జీపీడీపీ) విధానంపై సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి సూపరింటెండెంట్ ఎం.మెహర్ ప్రకాష్ అధ్యక్షత వహించగా జేపీ జీపీడీపీపై శిక్షణ పొందిన ఎంపీడీవో రాజు, గ్రామ కార్యదర్శి జే అయ్యన్న, డిజిటల్ అసిస్టెంట్ పి.వీరాస్వామి పాల్గొని మండల లైన్ డిపార్ట్మెంట్ ప్రతినిధులైన గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ, ఐసీడీఎస్, వెలుగు, ఉపాధి హామీ సిబ్బందికి జీపీడీపీ గురించి ప్రసార మాధ్యమాల ద్వారా సమగ్రంగా వివరించారు. ఏఓ ఎస్.లక్ష్మీ లావణ్య, గృహ నిర్మాణశాఖ జేఈ దర్నాల శ్రీనివాసు, ఏపీఎం ఎం.ధనరాజు, ఏపీఓ జి.అరుణ కుమారి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, వై.అరుంధతి, యానిమేటర్లు పాల్గొన్నారు.

**పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి**

మామిడికుదురు: గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించాలని అమలాపురం డీఎల్‌పీఓ పి.బొజ్జిరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎస్‌హెచ్‌జీ సిబ్బందికి పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై అవగాహన, శిక్షణా తరగుతులు నిర్వహించారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క సమస్యను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**గ్రామాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి**

పి.గన్నవరం: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ కేవీ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా వీఓఏలకు శుక్రవారం ఆయన జీపీడీపీ, బీపీడీపీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఉమా మహేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవలు

మామిడికుదురు: నగరం హుస్సేనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. గురుహే తాజ్‌దారే పురాత్, అంజుమనే గాజీ అబ్బాస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. అమలాపురానికి చెందిన ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు ఉదయ్, కె.గురుప్రసాద్ ఆధ్వర్యంలో 105 మందికి ఉచితంగా వైద్య సేవలందించారు. బీపీ, సుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పలువురికి ఈసీజీ పరీక్షలు చేశారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, అసోసియేషన్ అధ్యక్షులు మీర్ ఖాదమ్ హుస్సేన్, కార్యదర్శి సయ్యద్ రాజక్ అలీ, ఇలియాస్ హుస్సేన్, సజ్జాద్ హుస్సేన్, కో-ఆప్షన్ సభ్యులు నూర్జెన్ అబ్బాస్, అన్వర్ షకీల్ అస్కరీ, గుల్షన్, ఆగా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎక్సైజ్ అధికారుల దాడులు

ఆత్రేయపురం: మండలంలోని వెలిచేరులో శుక్రవారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. దాడుల్లో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## డిజిటల్ అసిస్టెంట్లు కీలకపాత్ర పోషించాలి



ఎంపీడీఓను సత్కరిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

ఆలమూరు: గ్రామాభివృద్ధిలో డిజిటల్ అసిస్టెంట్లు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం శుక్రవారం జరిగింది. గ్రామస్థాయిలో జరిగే ప్రతి అభివృద్ధి పనుల్లో డిజిటల్ అసిస్టెంట్ల ముద్ర ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని సంబంధిత లబ్ధిదారులకు చేరే విధంగా కృషి చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను, ప్రజలను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. మండలంలోని ఆలమూరు-1, కలవచర్ల గ్రామాల్లో డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నందున సమీప గ్రామ సచివాలయ సిబ్బంది ఆ బాధ్యతలు తీసుకుని ఆయా గ్రామాల ప్రజలకు సేవలందించాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజును మండలంలోని డిజిటల్ అసిస్టెంట్లు ఘనంగా సత్కరించారు.



# ఆలయాల్లో కార్తిక పౌర్ణమి రద్దీ



పి.గన్నవరం శివాలయం వద్ద జ్వాలా తోరణం



దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సఖినేటిపల్లి: కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం శైవ, వైష్ణవాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. శివాలయాల్లో బిల్వ పత్రాలతో పూజలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, పార్వతీ దేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే వైష్ణవ ఆలయాల్లో లక్షతులసి పత్రాలతో పూజలు చేశారు. అంతర్వేది లక్ష్మీ నృసింహుని ఆలయంలో వేపచెట్టు వద్ద దీపారాధనలు చేశారు. అంతర్వేది ఆలయంలో నిత్యాన్నదాన పథకంలో ఆలయ ఏసీ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో భక్తులకు భోజన వసతి దేవస్థానం కల్పించింది. అంతర్వేది, మోరి, గుడిమూల శివాలయాల్లో వేకువజామున నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయాల్లో నందీశ్వరుని వద్ద, జమ్మిచెట్లు, ధ్వజస్తంభాల వద్ద భక్తులు దీపారాధనలు చేశారు.

పి.గన్నవరం: కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు శివాలయాలకు వెళ్లి పూజలు చేశారు. మహిళలు శివాలయాలకు వెళ్లి కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తగా వివాహమైన యువతులు శివాలయాల్లో కొబ్బరి బొండాలు, కందమొక్కలు, అరటిపళ్లు సమర్పించి, కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పి.గన్నవరంలోని గరుడేశ్వరాలయంలో అర్చక స్వామి భైరవభొట్ల సత్య వెంకట నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తికపౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి పి.గన్నవరంలోని గరుడేశ్వరాలయం వద్ద జ్వాలా తోరణం వైభవంగా జరిగింది.

**ఘనంగా కుంకుమ పూజలు**

కొత్తపేట: కార్తికమాసం పౌర్ణమి పర్వదినం సందర్భంగా స్థానిక బొరుసువారిసావరం విజయకనకదుర్గాదేవి అమ్మవారికి మహిళలు శుక్రవారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు బిక్కోలు సత్యనారాయణాచార్యులు, వేదపండితులు బ్రహ్మశ్రీ అనంతలక్ష్మణ కుమారాచార్యులు బ్రహ్మత్వాన పండితులు ఉదయం నుంచీ వైఖానస శాస్త్రోక్త విధానంగా గణపతి పూజ, అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యుడు కొత్తపల్లి వెంకన్న దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, బి.సావరం పెద్దలు, యువకులు వలంటరీ సేవలందించారు.

అంబాజీపేట: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలో ఉన్న శైవ క్షేత్రాలు భక్తులతో శుక్రవారం పోటెత్తాయి. గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన పార్వతీ వీరేశ్వరస్వామి, శ్రీ, భూ సమేత కేశవస్వామి ఆలయం, మాచవరం ఆలయంలోనూ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, మొసలపల్లి, వాకలగరువు, కె.పెదపూడి, ముక్కామల, ఇరుసుమండ గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో స్వామి వార్లకు లక్ష బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మామిడికుదురు: కార్తిక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు శుక్రవారం భక్తులతో కోలాహలంగా మారాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు భారీగా ఆలయాలకు తరలి వచ్చారు. ఈశ్వరుడికి అభిషేకాలు చేయించుకున్నారు. మామిడికుదురు, నగరం, గెద్దాడ తదితర గ్రామాల్లో జ్వాలాతోరణం వెలిగించారు. కార్యక్రమంలో భక్తులు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదుర్రులోని సర్వమంగళ పార్వతీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. ఉపాధ్యాయుల రవికుమార్ దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఈ పూజలో కర్తలుగా పాల్గొన్నారు.

### అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో...



ఆలయంలో శంఖు, చక్రం, తిరునామం ఆకారంలో ఏర్పాటు చేసిన నూనె దీపాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలోను, అంతర్వేది నీలకంఠేశ్వరస్వామివారి ఆలయంలోను శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా అర్చకులు దీపోత్సవం నిర్వహించారు. లక్ష్మీనృసింహుని ఆలయంలో శంఖు, చక్రం, తిరునామం ఆకారంలో అర్చకులు నూనె దీపాలను ప్రమిదల్లో ఏర్పాటు చేశారు. అలాగే నీలంకఠేశ్వరస్వామివారి ఆలయంలో ఓంకారం, శివలింగం ఆకారంలో అర్చకులు నూనె దీపాలను ప్రమిదల్లో ఏర్పాటు చేశారు.